## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జగిత్యాలరూరల్: మండలంలోని కండ్లపల్లి మోడల్ స్కూల్లో 7వ తరగతి చదువుతున్న రోహిత ఈనెల 4, 5 హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి తృతీయస్థానంలో నిలిచింది. గురువారం పాఠశాల ప్రిన్సిపాల్ నాగ సుధారాణి, పీడీ వినీత్, అజీమ్, కోచ్ శ్రీరామ్, ఉపాధ్యాయులు రోహితను అభినందించారు.

### రేపు ధర్మపురికి రేవంత్

- సభా స్థలాన్ని పరిశీలించిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



స్థలాన్ని పరిశీలిస్తున్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ధర్మపురి:ధర్మపురికి ఈనెల 11న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రానున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బహిరంగ సభ కోసం డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం రాత్రి స్థలాన్ని పరిశీలించారు. జాతీయ రహదారి పక్కనున్న హెలిప్యాడ్‌ను పరిశీలించారు.

### 14న వేలం పాట

ధర్మపురి : పాత కర్ర వేలం కోసం కళాశాలలో చేపడుతున్న వేలం పాటను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పాత భవనాన్ని కూల్చివేయగా అందులో లభించిన పాత కర్రను ఈనెల 14న ఉదయం 10.30 గంటలకు వేలం వేయనున్నట్లు తెలిపారు.

### కేడీసీసీ బ్యాంకు ప్రారంభం



బ్యాంకును ప్రారంభిస్తున్న గోపాల్ స్వామి

జగిత్యాల: జగిత్యాల గాయత్రి బ్యాంక్ ఆధ్వర్యంలో మరో బ్రాంచ్‌ను గోదావరిఖనిలో తెలంగాణ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్‌స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాయత్రిబ్యాంక్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతూ వినియోగదారులకు చేయూతనందిస్తుందన్నారు. ఇప్పటికే 27 శాఖలను ప్రారంభించనట్లు తెలిపారు. కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా 1370.38 కోట్ల డిపాజిట్లతో 982.34 కోట్ల రుణాలు కలిగి ఉన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ముత్యాల లక్ష్మారెడ్డి, సీఈవో వనమాల శ్రీనివాస్, రాజశేఖర్, సౌజన్య, రాజిరెడ్డి, సత్యం పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి సహకరించాలి



పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మల్యాల: మండలకేంద్రంలోని కొత్తపేటలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకురావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. వేద పండితులు ప్రణీత్ శర్మ ఆధ్వర్యంలో గురువారం ఆలయ దర్వాజ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. దాతల సహకారంతో ఆలయ నిర్మాణం కొనసాగుతోందని, మరింత మంది దాతలు ముందుకు వచ్చి నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు ఎల్లాల జనార్దన్ రెడ్డి, అల్లూరి రాజేశ్వర్ రెడ్డి, నేరెళ్ల భూమారెడ్డి, వద్దెపల్లి శశాంక్, కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ పోతరాజు శ్రీనివా స్, గడ్డం కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నాలుగేళ్లుగా ఎదురుచూపులే ?

- ఎస్సారెస్పీ వరదకాలువ ద్వారా గతంలో చెరువులు నింపుతామని ప్రకటించిన ప్రభుత్వం
- చివరి పంటలకు అందని సాగునీరు



కథలాపూర్ శివారులో ఎస్సారెస్పీ వరదకాలువ

కథలాపూర్: తలాపున గోదావరి ఉన్నా ఎస్సారెస్పీ వరదకాలువ సమీపంలోని గ్రామాల రైతుల పంటలకు నీరందని పరిస్థితి. కాళేశ్వరం రివర్స్ పంపింగ్‌తో పాటు ఏటా వానాకాలంలో కురుస్తున్న వర్షాలతో ఎస్సారెస్పీ వరద కాలువ జలకళ సంతరించుకుంది. కాలువకు తూములు ఏర్పాటు చేయడంతో దిగువన ఉన్న పలు గ్రామాల్లోని చెరువులకు నీరు చేరుతోంది. ఎగువన ఉన్న గ్రామాల చెరువులకు మాత్రం చుక్కనీరు రాని పరిస్థితి. వరదకాలువకు ఎగువ గ్రామాలకు నీరందించాలని ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు 2019 జనవరి 2న సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందించారు. సీఎం సూచన మేరకు అధికారులు వరద కాలువను పరిశీలించి ఎత్తిపోతల ద్వారా చెరువులు నింపవచ్చన్నారు. అందుకు అధికారులు సర్వే చేసి ప్రతిపాదనలు పంపినా ఆమోదం లభించకపోవడంతో మండలంలోని రైతులు నిరాశ చెందుతున్నారు. తమ గ్రామ శివారులోని చెరువులు నిండాలంటే వర్షధారమేనని, ఎత్తిపోతల పనులకు నాలుగేళ్లయినా మోక్షం లభించలేదని రైతులు వాపోతున్నారు.

**వరదకాలువ వెళ్లే గ్రామాలివే..**

మండలంలో 19 గ్రామాలుండగా 84 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఎస్సారెస్పీ వరదకాలువ మాత్రం కథలాపూర్ మండలంలో పెగ్గెర్ల, కథలాపూర్, దుంపేట, దూలూర్, తక్కళ్లపెల్లి గ్రామాల నుంచి వెళ్తుంది. కాలువ నుంచి ఆయాగ్రామాల చెరువులను నింపేందుకు ఇప్పటికే అధికారులు తూములు నిర్మించారు. ఈ తూములు వరదకాలువకు దిగువ భాగాన ఉండటంతో కొన్ని గ్రామాల చెరువుల్లోకి నీరు వెళ్తోంది. ఎత్తున ఉన్న గ్రామాల చెరువులకు నీరు అందకపోవడంతో ఎత్తిపోతల ద్వారానే నీరందిస్తామని ప్రజాప్రతినిధులు ప్రకటించి నాలుగేళ్లు గడుస్తున్నా పనులకు మోక్షం లభించడం లేదు. దీంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### పనులు ప్రారంభించాలి



గ్రామ శివారులోని ఊర చెరువులో నీరుంటే పంటలకు ఢోకా లేదు. వరదకాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా మండలంలోని చెరువులను నింపుతామని ప్రకటించినా నేరవేరలేదు. పనులు త్వరగా ప్రారంభించాలి.

– దేశవేని గంగాధర్, తాండ్రియాల

### ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే



వరదకాలువ నుంచి ఎత్తిపోతలతో సూరమ్మ చెరువును నింపుతామని సీఎం కేసీఆర్, బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రకటించారు. ఎత్తిపోతల పేరుతో రైతులను మభ్యపెట్టి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్నారు.

– జువ్వాజి ఆదిరెడ్డి, రైతు, అంబారిపేట

### ప్రతిపాదనలు పంపాం

ప్రస్తుతం వర్షాధారం ఆధారంగా చెరువులు నిండుతున్నాయి. ఎస్సారెస్పీ వరదకాలువ నుంచి మండలంలోని చెరువులు నింపే పనులకోసం అన్ని చెరువులను పరిశీలించాం. ప్రతిపాదనలు పంపాం. పరిపాలన అనుమతి రాలేదు. నిధులు మంజూరు అయితే పనులు చేయిస్తాం.

– గంగాధర్, ఏఈ, వరదకాలువ ఎత్తిపోతల విభాగం

# పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లోకి



జగిత్యాల రూరల్ : నామినేషన్ వేసేందుకు ఎడ్లబండిపై బయల్దేరిన ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 14వ వార్డుకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. బీజేపీ అభ్యర్థి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణి కుటుంబ సభ్యులు భోగ సత్యనారాయణ, సుజాత ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

**ఆలయంలో పూజలు**

జగిత్యాలరూరల్: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దంపతులు గురువారం జగిత్యాల అర్బన్ మండలం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎడ్లబండిపై నామినేషన్ వేసేందుకు బయల్దేరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు సురేశ్ పాల్గొన్నారు.

# ఇంటింటా బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

ఇబ్రహీంపట్నం: మండలంలోని కొజన్‌కొత్తూర్, కేశాపూర్ గ్రామాల్లో గురువారం కోరుట్ల ఎమ్మెల్యేగా డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ను గెలిపించాలని కోరుతూ ఎంపీపీ జాజాల భీమేశ్వరి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చేసిన అభివృద్ధి పనులతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఇబ్రహీంపట్నం, తిమ్మాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సమక్షంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంతి మోసె ఆనంద్, మాజీ పాత్రికేయులు నందగిరి ప్రసాద్, నాయకులు సిరిపురం పెద్ద రాజన్నతో పాటు 50 మంది యువకులు పార్టీలో చేరారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎలాల దశరథ్ రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, నాయకులు నేరేళ్ల దేవేందర్, బాజన్న, నర్సగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేసే వారినే ఆశీర్వదించండి



యూసుఫ్‌నగర్ ప్రచారం చేస్తున్న నాయకులు



మేడిపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కోరుట్లరూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్, అయిలాపూర్, తిమ్మయపల్లి, కిషన్‌రావుపల్లె గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌కు ఓటు వేయాలని కోరారు. అభివృద్ధి చేసేవారినే ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రైబస అధ్యక్షుడు చీటి వెంకట్రావు, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, ఎంపీపీ తోట నారాయణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, వైస్‌ఎంపీపీ చీటి స్వరూపారాణి, సర్పంచ్‌లు పిడుగు రాధ, దుంపాల నర్సు, భాస్కర్ రెడ్డి, అంజయ్య, మల్లారెడ్డి, ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ సురేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాలను వివరించాలి**

మెట్‌పల్లిరూరల్: బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని మెట్‌పల్లి ఎంపీపీ మారు సాయిరెడ్డి అన్నారు. మెట్‌పల్లి మండలం మేడిపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు సంజయ్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు, చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. సంజయ్ గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పీసు తిరుపతిరెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌తోనే సుస్థిర పాలన అందనుందని జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వెంకట్రావ్‌పేట, వేంపల్లి, గొర్రెపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. విపక్షాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, మండల అధ్యక్షుడు కోమ్ముల జీవన్‌రెడ్డి, సర్పంచ్‌లు జోగుల మమత, బిట్ల సరోజన, కొంపెల్లి సరోజన, ఎంపీటీసీ సుజాత, గంగగౌరీశ్వర ఆలయ కమిటీ చైర్మన్ ఎలాల కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఆదిరెడ్డి, జోగుల రాజేశ్, తోట శ్రీనివాస్, బిట్ల నరేశ్, మీనుగు చంద్రశేఖర్, జీవన్ రెడ్డి, బద్దం నర్సారెడ్డి, క్యాతం జీవన్‌రెడ్డి, ముద్దం శరత్‌గౌడ్, కమలాకర్, నిమ్మల భూమారెడ్డి, సరికెల మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా సహకార అధికారి సత్యనారాయణ

- జిల్లా సహకార అధికారి మాదాసు సత్యనారాయణ

మల్లాపూర్: మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డ్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి మాదాసు సత్యనారాయణ ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. మార్కెట్‌యార్డ్ కార్యదర్శి నీరటి సురేందర్, ప్యాక్స్ సీఈవో పాదం భూమేశ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌కు కౌన్సిలర్ రాజీనామా



రాజీనామా లేఖను చూపుతున్న కౌన్సిలర్

కోరుట్ల : పట్టణానికి చెందిన 33వ వార్డు కౌన్సిలర్ రుద్ర సుజాత, ఆమె భర్త, జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ బీఆర్‌ఎస్ పార్టీకి గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడికి పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ విధానాలు నచ్చకపోవడంతోనే పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు పేర్కొన్నారు.

**రామయ్యపల్లి సర్పంచ్..**

ధర్మపురి: బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మండలంలోని రామయ్యపల్లి సర్పంచ్ మెడపట్ల దుబ్బయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

# పోస్టల్ సేవలను వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న రాజేశం

మల్లాపూర్ : కేంద్ర ప్రభుత్వం తపాలశాఖ ద్వారా అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ పోస్టుమాస్టర్ దురిశెట్టి రాజేశం అన్నారు. గురువారం మండలంలోని చిట్టాపూర్ తపాలశాఖ ఆధ్వర్యంలో పోస్టల్ బీమా పథకాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సుకన్య సమృద్ధి యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, సేవింగ్స్ ఖాతా వంటి పథకాలపై తపాలాశాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తపాలశాఖ ప్రత్యేకంగా టాటా జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.399, రూ,299 బీమా పాలసీలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. 18 నుంచి 65 ఏళ్లలోపు వారు బీమా పొందేందుకు అర్హులన్నారు. పాముకాటు, గుండెపోటు, విద్యుదాఘాతంతో మృతిచెందితే రూ.10 లక్షల జనరల్ ఇన్సూరెన్స్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త గణపతి విష్ణువర్ధన్‌రాజు, దువ్వ నవీన్, కొండ గణేశ్, నాగ శ్రీనివాస్, అంజన్న నరేశ్, భూమానందం, శ్రీనివాస్, రాకేష్, కై లాసపతి తదితరులు పాల్గొన్నారు.

### సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై సతీశ్

పెగడపల్లి: మండలంలోని రాజరాంపల్లి గ్రామానికి చెందిన బండారి బీరయ్య సెల్‌ఫోన్ పోగొట్టుకోగాం మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి గురువారం బీరయ్యకు అందజేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా తమ సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు.

# సంజయ్ నామినేషన్‌కు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు



నామినేషన్‌కు తరలివెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులతో జెడ్పీటీసీ జాదవ్ అశ్విని

రాయికల్: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గురువారం నామినేషన్ వేయగా రాయికల్ పట్టణం, మండలంలోని 32 గ్రామాల నుంచి వేలాది మంది కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు గురువారం డాక్టర్ సంజయ్‌కుమార్ నామినేషన్‌కు తరలివెళ్లారు. బస్సులు, ద్విచక్రవాహనాలతో పాటు, ఆటోల్లో జగిత్యాలలో జరిగిన బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్‌కుమార్ నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లారు.

### దస్తీలు అందజేత



దస్తీలతో విద్యార్థులు

వెల్గటూర్ : ఎండపల్లి మండలం గుల్లకోట ప్రాథమిక పాఠశాల రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన పాఠశాల అని ఎంఈవో బత్తుల భూమయ్య కొనియాడారు. గురువారం గుల్లకోట ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు కరీంనగర్‌లోని రామ్‌రాజ్ కాటన్ షోరూం యజమాని తిరుపతి సౌజన్యంతో పాఠశాల విద్యార్థులకు చేతి రుమాళ్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు క్రమశిక్షణ, నాణ్యమైన విద్యను అందించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చందూరి రాజిరెడ్డి, ఉపాధ్యాయ బృందాన్ని ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, శ్రీనివాస్, నరేశ్‌కుమార్, శ్రీలత, కృష్ణారెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ గొల్లపల్లి శిరీష, తదితరులు పాల్గొన్నారు.



### రోడ్లపైనే ధాన్యం

పెగడపల్లి: ధాన్యం ఆరబెట్టుకునేందుకు కల్లాలు లేక రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోస్తున్నారు. మండలంలోని పెగడపల్లి, వెంగళాయిపేట, నర్సింహునిపేట. సుద్దపల్లి, లింగాపూర్, బతికపల్లి మ్యాకవెంకయ్యపల్లి, అయితిపల్లి, గ్రామాల్లో సహకార సంఘాలు, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరిస్తున్నారు. ఏటా ఇదే తంతు జరుగుతోందని గ్రామాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో కల్లాల నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

### క్షేత్రస్థాయి సందర్శన



రాయికల్: పట్టణంలోని విజ్‌డమ్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులు గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇటిక్యాలలోని వృద్ధాశ్రమం, రాయికల్ పట్టణంలోని యూనియన్ బ్యాంక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ మేనేజర్ తిరుపల్ నాయక్ బ్యాంక్‌లో అందిస్తున్న సేవలపై వివరించారు. ప్రిన్సిపాల్ ఎద్దండి ముత్యంరాజు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల: మండలంలోని 33కేవీ మరమ్మతుల కారణంగా మల్యాల, కొండగట్టు, తాటిపల్లి, తక్కళ్లపల్లి సబ్‌స్టేషన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ సీహెచ్ బాలలింగం తెలిపారు.